

నిందితులను కఠినంగా శిక్షించాలి

దారుణ హత్యకు గురైన వైఎస్సార్ సీపీ కార్యకర్త గాలి బ్రహ్మయ్యను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు.

- 8లో..



కందిపప్పు..ఏది చెప్పు?

రేషన్ దుకాణాల్లో ఈనెల కూడా కందిపప్పు సరఫరా చేయలేదు. కేవలం బియ్యం, చక్కెర ఇచ్చి చేతులు దులుపుకున్నారు. దీనిపై కార్డుదారులు మండిపడుతున్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
37 /28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయుల పదోన్నతుల సమస్యను పరిష్కరించాలి

ఒంగోలు సిటీ: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని ఉపాధ్యాయుల పదోన్నతులు ఆగిపోయి కోర్టులో ఉన్నాయని, వాటిని సొసైటీ సెక్రటరీ చొరవ తీసుకొని పరిష్కరించాలని ఎస్టీయూ సోషల్ వెల్ఫేర్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి చిన్నయ్య పేర్కొన్నారు. ఒంగోలు పట్టణంలోని ఏపీటీయూసీ భవనంలో సామాజిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి చిన్నయ్య మాట్లాడుతూ ప్రస్తుతం అమల్లో ఉన్న స్కూల్ టైమ్ టేబుల్ ను ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించాలన్నారు. స్టడీ అవర్స్‌ను ఉదయం గం.7.45 నుంచి గం.8.45 వరకు పెట్టాలని సూచించారు. జనవరి 2022 నుంచి ఆగస్టు 2022 వరకు రావాల్సిన పీఆర్సీ శాలరీ డిఫరెన్స్ ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్రయ్య, వి.శాంతారామ్, కె.అచ్చయ్య, శ్రీరాములు, వంశీకృష్ణ, బ్రహ్మేంద్ర, పార్ట్‌టైమ్ టీచర్స్ రవి, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

అండర్ 14 బాలుర జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక రేపు

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ 14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక స్థానిక మంగమూరు రోడ్డులోని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సబ్ సెంటర్ నెట్స్‌లో నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుంది. ఆసక్తిగల క్రీడాకారులు తప్పనిసరిగా వైట్ డ్రస్, షూస్, సొంత కిట్, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్‌తో హాజరుకావాలి. 2011 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 2013 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించిన వారు మాత్రమే అర్హులు. పూర్తి వివరాల కోసం కోచ్ కె.సుధాకర్ మొబైల్ నంబర్ 9701022333, బి.చంద్రశేఖర్ మొబైల్ నంబర్ 9246222999లను సంప్రదించాలని జిల్లా కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు తెలిపారు.



పేకాట లక్షణంగా!

- అధికార టీడీపీ నేతల కనుసన్నల్లో జోరుగా పేకాట శిబిరాలు
- కీలక నేతల ఒత్తిళ్లతో కన్నెత్తి చూడని పోలీసులు
- ఒంగోలు ప్రత్యేక బృందంతో యరజర్ల పేకాట శిబిరంపై దాడులు
- పూర్తి వివరాలు నేటికీ బయట పెట్టని ఖాకీలు
- భారీగా నగదు స్వాధీనం అంటూ ప్రచారం
- ఒంగోలుకు చెందిన టీడీపీ నేతలు ఉండడంతో కేసు పక్కదోవ
- దాడి సమయంలో తీసిన వీడియో, బయట పెట్టని వైనం

సాక్షిప్రతినిధి, ఒంగోలు:

కొండపి నియోజకవర్గం పేకాటకు కేంద్రంగా మారింది. అధికార పార్టీ నేతల కనుసన్నల్లో అన్ని మండలాల్లో జూదక్రీడ జోరుగా సాగుతోంది. ప్రధానంగా టంగుటూరు మండలం కేంద్రంగా ఈ దందా పెద్దఎత్తున సాగుతోందని తెలుస్తోంది. ప్రతిరోజు కోటి రూపాయలకు పైగా ఆట జరుగుతుందంటే పేకాట ఏ స్థాయిలో సాగుతుందో అర్ధమవుతుంది. పేకాట ఆడాలంటే 5 వేల రూపాయలు ప్రవేశ రుసుం వసూలు చేస్తున్నారని తెలిసింది. ఒక్కో వ్యక్తి వద్ద రూ.1.50 లక్షలు నగదు ఉంటేనే ఆటకు అనుమతి ఉంటుంది. ఆ ప్రకారం 20 మంది వరకు ఆటలో ఉంటారు. వీరు ఆటలో డబ్బులు వస్తే తప్పనిసరిగా 18 ఆటలు ఆడాలి. డబ్బులు పోతుంటే మధ్యలోనే ఆగిపోవచ్చు. వీరికి ఆర్థిక సహాయం చేయటానికి ఫైనాన్షియర్స్ కూడా అందుబాటులో ఉంటారు. వీరు రూ.90 వేల నగదు ఇస్తే తరువాత రోజు లక్ష రూపాయలు ఇవ్వాల్సి ఉంటుందని తెలుస్తోంది. అయితే నిర్వాహకులు తమకు వచ్చిన ఆదాయంలో అధికార పార్టీ నేతలతో పాటుగా అధికారులకు కూడా నెలనెలా మామూళ్లు ముట్టజెబుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నియోజకవర్గంలో పొన్నలూరు మండలంలో ముప్పాళ్ల, మాలపాడు, కే అగ్రహారం ప్రాంతంలో ప్రతిరోజు సుమారు కోటి రూపాయలకు పైగా పేకాట జరుగుతున్నా పోలీసులు అటు వైపు తొంగి చూసే పరిస్థితి కనిపించడం లేదు. కే అగ్రహారంలో ఆ ప్రాంత ప్రజాప్రతినిధి ఆధ్వర్యంలో పేకాట శిబిరం జరుగుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. జరుగుమల్లి మండలంలో రామచంద్రాపురం, సింగరాయకొండ మండలం సముద్రతీర ప్రాంతంలోను, తీరప్రాంతానికి దగ్గరగా ఉన్న చెరువుల్లో ప్రతిరోజు సుమారు రూ.40 లక్షల వరకు ఆట సాగుతోంది. మర్రిపూడి మండలంలో శివరాయునిపేట, నరసరాజుపాలెం, గుండ్ల సముద్రం, మర్రిపూడి,గార్లపేట, కెల్లంపల్లి ప్రాంతంలో పేకాట దందా జోరుగా సాగుతోంది. శివరాయునిపేట గ్రామం చీమకుర్తికి దగ్గరగా ఉండటంతో ఆ ప్రాంతం నుంచి భారీగా వస్తారని ఇక్కడ సుమారు రూ.అరకోటి వరకు ఆట జరుగుతుండగా, నరసరాజుపాలెం గ్రామం కనిగిరి, కందుకూరు నియోజకవర్గ ప్రజలకు దగ్గరగా ఉండటంతో ఆ ప్రాంతాల నుంచి భారీగా వస్తారని ఇక్కడ కూడా సుమారు అరకోటి పైగా ఆట జరుగుతుందని తెలుస్తోంది. ఈ ప్రకారం కేవలం ఒక్క మర్రిపూడి మండలంలో కోటిన్నర పైగా పేకాట జరుగుతుందని ఆప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. కొండపి మండల కేంద్రంలో భారీగా పేకాట ఆడిస్తున్నారు. వారం రోజులుగా పేకాట నిర్వహణ ఆగిందని కారణాలు తెలియడం లేదని త్వరలో ఈ ప్రాంతంలో ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.

అదో డెన్. అక్కడ పదుల సంఖ్యలో కార్లు పార్కింగ్ చేసి ఉంటాయి. లోపల కార్డులు చేతులు మారుతుంటాయి. రూ.కోట్ల నోట్ల కట్టలు టేబుళ్లపై ఎగురుతుంటాయి. ఈ జూద క్రీడకు కొండపి అడ్డాగా మారింది. జూదరాయుళ్లకు రాజకీయ నేతల అండ ఉండడం, నెలవారీ మామూళ్ల కవర్లు ఠంచన్‌గా అందుతుంటే... పోలీసులు మాత్రం తమకేమీ తెలియదన్నట్లుగా కళ్లు మూసుకుని ధ్రుతరాష్ట్రుడి పాత్ర పోషిస్తుంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే.. కొండపి నియోజకవర్గం నేటి లాస్‌వేగాస్‌గా మారిందంటే అతిశయోక్తి కాదేమో. ప్రత్యేక బృందం వచ్చి యరజర్లలో దాడి చేసినా నిజం బయటపెట్టే ధైర్యం ఎవరికీ లేదు. ఎందుకంటే పేకాట ఆడేది.. ఆడించేది అధికార పార్టీ నేతలు కావడమే.

యరజర్ల శిబిరంపై దాడుల వెనుక మర్మమేమిటో..

యరజర్లలో నిర్వహించే పేకాట కేంద్రం కొండపి నియోజకవర్గంలోని టంగుటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో కాగా రెవెన్యూ పరంగా ఒంగోలు నియోజకవర్గ పరిధిలో ఉంది. ఇక్కడ కొన్ని నెలలుగా ఈ శిబిరం నడుస్తోందని తెలుస్తోంది. అయితే ఒంగోలు నగరం నుంచి ప్రత్యేకంగా ఒక బృందం వచ్చి ఆకస్మికంగా దాడులు చేసింది. ఈ శిబిరాన్ని అధికార టీడీపీ ముఖ్యనేత సన్నిహితుడు నిర్వహిస్తున్నాడని తెలిసింది. నియోజకవర్గ పెద్దల కనుసన్నల్లో పేకాట శిబిరాలు జరగడం, నెలకు రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతుండటంతో గిట్టని ఒంగోలు నియోజకవర్గ పెద్దల ఆదేశాలతో పోలీసులు దాడులు చేశారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. పేకాట ఆడుతూ పట్టుబడిన వారిలో ఎక్కువ శాతం మంది టీడీపీవారే ఉండడంతో ఆ పార్టీ నేతలు ఉలిక్కిపడుతున్నారు.

పట్టుకుంది భారీగా.. చూపించింది నామమాత్రంగా..

యరజర్ల పేకాట కేంద్రం పై దాడిలో సుమారు భారీ ఎత్తున నగదు, నిర్వాహకుడితో పాటు మరో ఆరుగురిని పోలీసులు అదుపులో తీసుకున్నామని చెబుతున్నారు. కానీ ఈ దాడిలో సుమారు రూ.అరకోటి దొరికిందన్న ప్రచారం జరుగుతోంది. అయితే పోలీసు వర్గాలు మాత్రం దాడి జరిగినప్పుడు అంతా పారదర్శకమేనని ప్రతిదీ వీడియో తీస్తారని చెబుతున్నా ఈ దాడిలో భారీగా నగదు దొరికిందన్న ఆరోపణలు వచ్చినప్పటికీ వీడియో మాత్రం బయట పెట్టలేదు. అంతేకాక పట్టుకున్న వారిలో ఒంగోలు కార్పొరేటర్లు కూడా ఉన్నారన్న ప్రచారం వచ్చినప్పటికీ వారి పేర్లు కూడా బయటకు రాని పరిస్థితి. యరజర్ల తోపాటు అనంతవరం గ్రామంలోని సముద్రతీరంలో, టంగుటూరు మండల కేంద్రంలోని రెండు లేక మూడు చోట్ల పొగాకు కంపెనీలలో పేకాట జోరుగా సాగుతోంది. కానీ ఇంత జరుగుతున్నా మామూళ్లకు అలవాటుపడిన పోలీసులు దాడులు చేయకుండా సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేకాట కేంద్రాలు ఎక్కువయ్యాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న ఈ పేకాట కేంద్రాలు అధినాయకుల మధ్య విభేదాల కారణంగా బట్టబయలయ్యాయని, లేకపోతే ఎన్ని నెలలైనా బయట పడేది కాదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఆక్వా రైతులను కాపాడాలి

- రైతు సంఘ జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు

కొత్తపట్నం: సంక్షోభంలో ఉన్న ఆక్వా రైతులను ప్రభుత్వం కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో రైతు సంఘ నాయకులు శుక్రవారం మండలంలో ఉన్న రొయ్యల చెరువుల దగ్గరకు వెళ్లి ఆక్వా యజమానులను కలుసుకున్నారు. ఈ నెల 8వ తేదీ ఒంగోలు ఎల్‌బీజీ భవనంలో ''రొయ్యల ఎగుమతులపై అమెరికా ఆంక్షలు – కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత – ప్రత్యామ్నాయ మార్గాలు'' అనే అంశంపై ఆక్వా రైతుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తారని, సమావేశాన్ని ఆక్వా రైతులు జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ అమెరికా విధించిన అధిక టారిఫ్‌ల వల్ల రాష్ట్రంలో ఆక్వా రంగంలో ఉన్న రెండున్నర లక్షల రైతులపై ప్రభావం పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి ఎస్ స్వామి రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



ఆక్వా రైతులతో మాట్లాడుతున్న పమిడి వెంకట్రావు

ఎరువుల కొరత సృష్టించింది చంద్రబాబే

- రైతులకు సరిపడా యూరియా లేకుండా చేసిన కూటమి ప్రభుత్వం
- ఎరువుల కొరతపై 9వ తేదీ ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన
- మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడం దుర్మార్గం
- ఆరోగ్య శ్రీని తూట్లు పొడిచేందుకు కుట్రలు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పక్కన వెంకాయమ్మ, బత్తుల, చుండూరి రవిబాబు తదితరులు

ఒంగోలు టౌన్: కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రంలో యూరియా కొరత సృష్టించిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది 39.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను ఉపయోగించారని, అయితే ఈ ఏడాది ఉద్దేశపూర్వకంగానే కేవలం 322 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే తెప్పించారని వివరించారు. రైతులకు అవసరమైన 7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి అవసరం లేదని కేంద్రానికి నివేదిక ఇచ్చారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువులు దొరక్క నానా అగచాట్లు పడుతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదన్నారు. నల్లబజారులో ఎరువులు విక్రయిస్తున్నారని, వారి వద్ద ఎరువులు ఎక్కడి నుంచి వచ్చాయో పాలకులు చెప్పాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవసరమైనంత మేర ఎరువులను తెప్పించి అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఎరువుల సమస్యపై ఈ నెల 9వ తేదీ ఆర్డీఓ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతు నాయకులతో వినతి పత్రం అందిస్తామని చెప్పారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వైద్య విద్య ప్రైవేటుపరం చేయడం దారుణం: ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో 10 మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయనున్నట్లు నిర్ణయం తీసుకోవడంపై బూచేపల్లి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జగనన్న హయాంలో దాదాపుగా పూర్తయిన మెడికల్ కాలేజీలను కుట్రపూరితంగా పక్కన పెట్టేశారని ధ్వజమెత్తారు. ఇప్పుడు పీపీపీ ద్వారా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు పన్నాగాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు కళాశాలల్లో భారీగా ఫీజులు కట్టి చదివే స్థోమతే లేని నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల అవసరం ఉందన్నారు. సామాన్య ప్రజలకు వైద్యం, నిరుపేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులో లేకుండా చేయడానికి కూటమి పాలకులు ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైద్యశాలలను, వైద్య కళాశాలలను నిర్వహించగలిగే స్థితిలో పాలకులు లేరన్నారు. ఇలాంటి ప్రభుత్వం ఉన్నా ఒకటే లేకపోయినా ఒకటేనని స్పష్టం చేశారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం దొడ్డిదారి ప్రయత్నాలు చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే ఆరోగ్య శ్రీ ఆస్పత్రులకు రూ.3 వేల కోట్ల బకాయిలు ఉన్నారని చెప్పారు. ఆరోగ్య శ్రీ ట్రస్ట్‌ను రద్దు చేసి బీమా కిందకు తీసుకొస్తున్నారని, ఒకవేళ ప్రభుత్వం బీమా కంపెనీలకు సకాలంలో నిధులు విడుదల చేయకపోతే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఎప్పటి నుంచో ఆయుష్మాన్ భారత్ ద్వారా వైద్య సేవలు అందిస్తోందని, ఇప్పుడు దానితో కలిపేసి ఆరోగ్యశ్రీని అమలు చేస్తున్నారని చెప్పారు. ఆరోగ్యశ్రీని ఎత్తివేసే కుట్రలు మానుకొని రాష్ట్రంలోని నిరుపేద ప్రజలకు ఉచిత వైద్య సేవలను అందించాలని డిమాండ్ చేశారు.

దోపిడీదారుల ప్రయోజనాలే చంద్రబాబుకు ముఖ్యం: చంద్రబాబుకు రాష్ట్ర ప్రజల, రైతుల సంక్షేమం పట్టడం లేదని, కేవలం దోపిడీదారుల ప్రయోజనాలే ముఖ్యమని ఒంగోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఒక వ్యూహం ప్రకారమే ఎరువుల కొరత సృష్టిస్తున్నారని తెలిపారు. ఎరువులు సరిపడా అందుబాటులో ఉంటే రైతులు వరి పండిస్తారని, అప్పుడు ప్రభుత్వం వరి కొనాల్సి వస్తుందని, ఇది ఇష్టం లేకనే ఎరువులను లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. పొగాకుకు డిమాండ్ ఉన్నా కంపెనీలతో కుమ్మక్కైన ప్రభుత్వం గిట్టుబాటు లేకుండా చేసిందని, తాజాగా కృత్రిమంగా ఎరువుల కొరత సృష్టించి రైతులను నిలువుగా దోచుకునేందుకు ప్లాన్ చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్టీ జిల్లా పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, నగర అధ్యక్షుడు కఠారి శంకర్, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, పీడీసీసీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు కేవీ రమణా రెడ్డి, వై.వెంకటేశ్వర్లు, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ, పంచాయతీరాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముల్లంగి రవీంద్రా రెడ్డి, ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి రొండా అంజిరెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారుబాబు, జిల్లా నాయకులు దేవరపల్లి అంజిరెడ్డి, దాసరి కరుణాకర్, మన్నెం శ్రీధర్ బాబు, షేక్ మీరావలి, టి.మాధవి, వడ్లమూడి వాణి, గోనెల మేరీ, బత్తుల ప్రమీల, దేవా, కిరీటి, పెట్లూరి ప్రసాద్, గౌతం కూనం, నాటారు జనార్ధన రెడ్డి, పిగిలి శ్రీనివాసరావు, ఆనం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు సర్వేపల్లి



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి, చుండూరి రవిబాబు, బత్తుల

- వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- పలువురు ఉపాధ్యాయులకు ఘన సత్కారం

ఒంగోలు టౌన్: ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చి తొలి రాష్ట్రపతిగా చరిత్ర సృష్టించిన డా. సర్వేపల్లి రాధాకృష్ణ జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని, తరగతి గదిలో దేశ నిర్మాణానికి పునాదులు వేసే ఉపాధ్యాయులను గౌరవించుకోవడం గర్వంగా ఉందని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ భవిష్యత్తు నిర్మాతలను తయారు చేసే ఉపాధ్యాయుడిగా పనిచేసిన రాధాకృష్ణ దేశానికే తొలి పౌరుడిగా ఎన్నికయ్యారని చెప్పారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఉపాధ్యాయులను సన్మానించే సంప్రదాయానికి తెరదీశారని చుండూరి రవిబాబును అభినందించారు. జిల్లా పరిశీలకులు బత్తుల బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తే ఉపాధ్యాయులు వారికి బంగారు భవిష్యత్తు ఇస్తారని చెప్పారు. నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు మాట్లాడుతూ గురువులను పార్టీ కార్యాలయంలో సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. దేశాభివృద్ధికి ఉపాధ్యాయులు చేసిన సేవలు మరిచిపోలేమన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఓబుల రెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకట రెడ్డి, ఓరుగంటి వెంకటేశ్వర్లు, ముప్పవరపు శ్రీనివాసులు, ఉపాధ్యాయిని నత్తల రాజేశ్వరిని ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివ ప్రసాద్ సన్మాన గ్రహీతలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కేవీ రమణా రెడ్డి, వై.వెంకటేశ్వర్లు, కఠారి శంకర్, బొట్ల సుబ్బారావు, వైఎం ప్రసాద్ రెడ్డి (బన్నీ), రొండా అంజిరెడ్డి, కరుణాకర్, నగరికంటి శ్రీనివాసరావు, బంగారుబాబు, ప్రసాద్, రవీంద్రా రెడ్డి, భూమిరెడ్డి రమణమ్మ, టి.మాధవి, వాణి, గోనెల మేరి, ప్రమీల, దేవా, జనార్దన్ రెడ్డి, కిరీటి పాల్గొన్నారు.

బాబు ప్రభుత్వంలో రైతులకు కష్టాలే



పెడతలపూడిలో క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

- రైతులకు మద్దతు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలం
- బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి రూరల్: చంద్రబాబు ఎప్పుడు సీఎం అయినా ముందుగా మోసపోయేది, నష్టపోయేది రైతులు, మహిళలే అని సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. మండలంలోని పెడతలపూడి, రామచంద్రపురం, బూసరపల్లి, జీఎల్‌పురం గ్రామాల్లో శుక్రవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. పెడతలపూడిలో బాబూ ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మేరుగు నాగార్జున మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి రైతన్న పంట పండిస్తే మద్దతు ధర కల్పించలేని దయనీయ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ మద్దతు ధర కల్పించాలని ధర్నాలు చేస్తేకాని, మద్దతు ధర పెంచే ఆలోచన కూటమి ప్రభుత్వానికి రాలేదన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు రైతుల పక్షాన పోరాడితే కేసులు పెట్టి అరెస్టులు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో యూరియా కొరత ఉన్నా రైతుల ఆవేదన బాబుకు పట్టదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షుడు చీదర్ల శేషు, మండల ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి జీ ఓబులరెడ్డి, కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, ఎం రాజేంద్ర, మేకల వీరారెడ్డి, డీ శేషారెడ్డి, బొడ్డు కోటేశ్వరరావు, తిరుపతిస్వామి, మల్లికార్జున, బాలాజీ, నియోజకవర్గ యూత్ అన్వేష్, కంకణాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి దిశానిర్దేశం చేసేది గురువులే



జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న గురువులు

- గురుపూజోత్సవంలో జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్: సమాజానికి దిశా నిర్దేశం చేసేది గురువులేనని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అన్నారు. విద్యార్థులను ఉన్నత వ్యక్తిత్వం కలిగిన పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత వారిపై ఉందన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో జిల్లా విద్యాధికారి ఏ.కిరణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి గురుపూజోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి వారు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఉన్నత విలువలు కలిగిన భావిపౌరులను తయారు చేసేది ఉపాధ్యాయులేనని అన్నారు. మంచి బోధనపై ఉపాధ్యాయులు మరింత దృష్టి సారించాలని సూచించారు. డీఆర్‌ఓ బీసీహెచ్ ఓబులేసు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ఉన్నతి ఉపాధ్యాయుల చేతుల్లో ఉంటుందన్నారు. ఉత్తమ సేవలు అందించిన 53 మంది ఉపాధ్యాయులను అతిథులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇతర అతిథులుగా పాల్గొన్న సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.ఎన్.విజయ్ కుమార్, రాష్ట్ర మారీటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, డీఆర్‌ఓ ఓబులేసుతో కలిసి తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



శాస్త్రీయ నృత్యం చేస్తున్న విద్యార్థిని

క్లుప్తంగా

శ్రీశైలం ఘాట్ రోడ్డులో ప్రమాదం

- అదుపుతప్పి బోల్తాపడిన టెంపో ట్రావెలర్ వాహనం
- పలువురికి స్వల్ప గాయాలు


బోల్తా పడిన టెంపో ట్రావెలర్

పెద్దదోర్నాల: శ్రీశైలం ఘాట్‌రోడ్డులోని చింతల గిరిజనగూడెం సమీపంలో ఓ టెంపో ట్రావెలర్ వాహనం అదుపుతప్పి బోల్తాపడటంతో అందులో ప్రయాణిస్తున్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. శుక్రవారం దోర్నాల నుంచి శ్రీశైలం వైపునకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అందులో ప్రయాణిస్తున్న పలువురు స్వల్పంగా గాయపడటంతో శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

విద్యుత్ తీగ చోరీ కేసులో నిందితుల అరెస్ట్

- రూ.3.90 లక్షల విలువైన సొత్తు రికవరీ

దర్శి: విద్యుత్ తీగ చోరీ కేసులో ముగ్గురు నిందితులు, ఇద్దరు జువెనైల్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.3.90 లక్షల విలువైన 11 కేవీ విద్యుత్ వైరు (7.7 కి.మీ) రికవరీ చేశారు. వారి వద్ద ఉన్న కారు, కట్టర్లను సీజ్ చేశారు. దర్శి సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. గత ఆగస్టు 29వ తేదీ చందలూరు పంచాయతీ సమీపంలోని ఇండస్ట్రియల్ పార్క్ వద్ద గుర్తు తెలియని దొంగలు 11 కేవీ విద్యుత్ వైరును చోరీ చేశారు. విద్యుత్ రూరల్ ఏఈ బందారు వేణుగోపాల్ ఫిర్యాదు మేరకు దర్శి ఎస్ఐ మురళీ కేసు నమోదు చేశారు. టెక్నాలజీ సాయంతో నిందితులను గుర్తించి గురువారం అరెస్టు చేశారు. ఈ నెల 3వ తేదీ మధ్యాహ్నం 4.30 గంటలకు దర్శి పట్టణంలో కాలువ వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పల్నాడు జిల్లా శ్రీరుక్మిణీపురంకు చెందిన ఫలితే హనుమనాయక్, ఫలితే చందర్ నాయక్, బట్టుల మహేష్, మరో ఇద్దరు మైనర్ బాలురను అదుపులోకి తీసుకున్నారు. కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారు.

18న తపాలా ఏజెంట్ల ఎంపికకు ఇంటర్వ్యూలు

ఒంగోలు వన్‌టౌన్: భారత ప్రభుత్వ తపాలా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా పాలసీలు సేకరించేందుకు ఏజెంట్లను ఎంపిక చేసేందుకు ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్ ఎండీ జాఫర్ సాధిక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన ఏజెంట్లకు పాలసీలను బట్టి ఆకర్షణీయమైన కమీషన్ చెల్లించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు కనీసం 10వ తరగతి పాసై ఉండాలని, 18 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలని సూచించారు. ప్రాంతీయంగా పరిచయాలు ఉండి ఇన్సూరెన్సు రంగంలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, ఇంటర్ సర్టిఫికెట్లు, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ కార్డుతో ప్రకాశం సీనియర్ సూపరింటెండెంట్ కార్యాలయం, భాగ్యనగర్ 2వ లైన్, ఒంగోలు చిరునామాలో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులు రూ.5 వేల సెక్యూరిటీ డిపాజిట్ చేయాలని తెలిపారు.

7న అట్రాసిటీ బాధితులకు న్యాయ సలహాలు

ఒంగోలు టౌన్: సకాలంలో న్యాయం జరగక ఇబ్బందులు పడుతున్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లోని బాధితులకు ఈ నెల 7వ తేదీ స్థానిక ఎల్బీజీ భవనంలో న్యాయవాదులతో న్యాయసలహాలు ఇవ్వనున్నట్లు కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రఘురాం, జిల్లా ఉపాధ్యక్షులు అట్లూరి రాఘవులు, వి.మోజేస్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎల్బీజీ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల రాష్ట్రంలో దళితులు, గిరిజనులపై దాడులు విపరీతంగా పెరిగిపోయాయని చెప్పారు. దళిత గిరిజనుల మీద అత్యంత క్రూరంగా దాడులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. నిందితులకు 41 సీఆర్‌పీ పేరుతో స్టేషన్ బెయిలిచ్చి పంపిస్తున్నారని, మరికొన్ని కేసులలో నేరుగా పోలీసులే ముద్దాయిలుగా ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోందని అన్నారు. దళితుల హత్యలు జరిగినప్పుడు నిబంధనల ప్రకారం రెవెన్యూ శాఖకు సమాచారం ఇవ్వకుండా పంచనామాలు నిర్వహించి సంతకాలు చేయిస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసులు నమోదైన తర్వాత బాధితులకు చట్టాలపై అవగాహన లేకపోవడంతో అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే బాధితులకు చట్టాలపై అవగాహన కల్పించడం కోసం న్యాయవాదులతో విచారణ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి ప్రకాశం జిల్లాతో పాటు నెల్లూరు, బాపట్ల, తిరుపతి జిల్లాల నుంచి బాధిత దళితులు హాజరవుతారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదై న్యాయం కోసం తిరుగుతున్న బాధితులు ఈ న్యాయ సలహాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి
- గాలి బ్రహ్మయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన వైఎస్సార్ సీపీ నేతలు


బాధితులతో మాట్లాడుతున్న అన్నా రాంబాబు


బాధితులను పరామర్శిస్తున్న బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, కేపీ నాగార్జునరెడ్డి

కంభం:

దారుణ హత్యకు గురైన వైఎస్సార్ సీపీ కార్యకర్త గాలిబ్రహ్మయ్య కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, మార్కాపురం, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా వెంకట రాంబాబు శుక్రవారం ఉదయం కంభం ప్రభుత్వ వైద్యశాలలో పరామర్శించారు. మండలంలోని దరగా గ్రామానికి చెందిన గాలి బ్రహ్మయ్య (25) గురువారం హత్యకు గురికాగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యేలు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం పోలీసులతో మాట్లాడి కేసు వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతి బాధాకరమని వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా దరగా లో అంత్యక్రియలు నిర్వహించారు. వారి వెంట ఎంపీపీలు ఓసూరారెడ్డి, వెంకట్రావు, ఏరువ రంగారెడ్డి, మండల కన్వీనర్‌లు గొంగటి చెన్నారెడ్డి, ఆవుల శ్రీధర్ రెడ్డి, స్టేట్ మైనారిటీ సెల్ సెక్రటరీ గఫార్ అలిఖాన్, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, రవికుమార్, సాంబశివారెడ్డి, సయ్యద్ ఖాసిం, సలీం, హుస్సేన్‌బాష, గురుమూర్తి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు ఉన్నారు.


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, కేపీ నాగార్జునరెడ్డి

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితుడు?


కంభం ప్రభుత్వ వైద్యశాలలో విలపిస్తున్న బ్రహ్మయ్య తల్లి రమణమ్మ


మృతుడు బ్రహ్మయ్య (ఫైల్)

బేస్తవారిపేట: వైఎస్సార్ సీపీ కార్యకర్త గాలి బ్రహ్మయ్యను కత్తులతో పొడిచి పెట్రోల్ పోసి నిప్పంటించి అతి దారుణంగా హత్య చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కంభం మండలం దరగకు చెందిన బ్రహ్మయ్యను బుధవారం రాత్రి మద్యం పార్టీకి పిలిచి హత్య చేయగా, గురువారం ఉదయం వెలుగులోకి వచ్చిన విషయం విధితమే. ఈ కేసులో బ్రహ్మయ్యతో కలిసి మద్యం తాగిన ఇద్దరితో పాటు అనుమానంతో మరొకరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. వీరిలో ఇద్దరిని గురువారం సాయంత్రం విడిచిపెట్టగా, ఒకరు పోలీసుల అదుపులోనే ఉన్నారు. మృతుడు బ్రహ్మయ్య యువకుడు, శారీరకంగా బలమైన వ్యక్తి. అతన్ని హత్య చేయాలంటే ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది కలిసి చేసి ఉంటారని గ్రామస్తులు అంటున్నారు. మృతుడితో రాత్రిపూట కలిసి ఉన్న వ్యక్తి, జేబీకే పురానికి చెందిన మరొకరితో కలిసి హత్య చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. పోలీసులు ఫోరెన్సిక్, క్లూస్ టీమ్, పోలీస్ జాగిలం, సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి తల్లి ఆక్రందన వర్ణనాతీతం..

గాలి వీరభద్రుడు, రమణమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా, కుమారుడు బ్రహ్మయ్య అంటే తల్లికి ప్రాణం. ఏడేళ్ల క్రితం భర్త మరణించగా, కుమారుడే కుటుంబానికి అండగా నిలబడతాడని ఎన్నో ఆశలు పెట్టుకుని జీవిస్తోంది. చేతికందివచ్చిన కొడుకు మరణంతో గురువారం ఉదయం నుంచి దిక్కులు పిక్కటిల్లేలా ఆమె రోదిస్తోంది. ఇక నాకు దిక్కెవరంటూ కుమిలి కుమిలి ఏడుస్తోంది. ఆ తల్లికి సర్దిచెప్పడం ఎవరి వల్లా కావడం లేదు. ఆ తల్లి బాధను చూసి గ్రామస్తులు సైతం కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

కందిపప్పు.. ఏది చెప్పు..!

- ఈ నెల కూడా రేషన్‌లో కందిపప్పు సరఫరా చేయని ప్రభుత్వం
- ఏడు నెలలుగా కందిపప్పు సరఫరా నిల్
- బయట మార్కెట్లో కిలో కందిపప్పు రూ.120
- జిల్లాలో 6,61,141 రేషన్ కార్డులు, 1,392 రేషన్ దుకాణాలు


ప్రభుత్వం అందించాల్సిన కందిపప్పు ప్యాకెట్లు

మార్కాపురం: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ షాపుల ద్వారా బియ్యం మినహా అదనపు సరుకులు ఇవ్వకపోతుండటంతో లబ్ధిదారులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. గత 7 నెలల నుంచి కందిపప్పు సరఫరా నిలిచిపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ వచ్చి నిత్యావసర సరుకులు అందించగా కూటమి ప్రభుత్వంలో లబ్ధిదారులు షాపుల వద్దకు వెళ్లి పడిగాపులు కాసినా బియ్యం, చక్కెర తప్ప ఏమీ ఉండకపోతుండటంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

దసరాకు కూడా పప్పన్నం లేనట్లే..!

ఈ నెలలోనే దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 2వ తేదీ విజయదశమి పండుగ జరుగనుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రేషన్ సరుకుల్లో బియ్యంతో పాటు కందిపప్పు, తదితర సరుకులేమైనా ఇస్తారేమోనని ప్రజలు ఆశపడ్డారు. కానీ, కనీసం కందిపప్పు కూడా ఇవ్వకపోవడంతో దసరాకు కూడా పప్పన్నం తినలేని పరిస్థితి ఏర్పడిందని లబ్ధిదారులు నిట్టూరుస్తున్నారు. రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం తెల్లరేషన్‌కార్డుదారులకు అందించే కందిపప్పు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నిలిచిపోయింది. ఏ నెలకు ఆ నెల వినియోగదారులు ఎదురుచూస్తున్నప్పటికీ రేషన్ షాపులకు కందిపప్పు మాత్రం సరఫరా కావడం లేదు. జిల్లాలో మొత్తం 6,61,141 రేషన్ కార్డులు ఉండగా, 1,392 రేషన్ దుకాణాల ద్వారా సరుకులు అందిస్తున్నారు. ప్రభుత్వం కిలో 67 రూపాయలకు కార్డుదారులకు కందిపప్పు ఇవ్వాల్సి ఉంది. అయితే, 7 నెలలుగా కందిపప్పు ఇవ్వడం నిలిపివేశారు. బయట మార్కెట్‌లో కిలో 120 రూపాయలు పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తుండటంతో అంత పెట్టి కొనలేక పేదలు లబోదిబోమంటున్నారు.

కందిపప్పు కేటాయింపు చేయాల్సింది ఇలా...

పౌరసరఫరాలశాఖ మార్కాపురం గోడౌన్ పరిధిలో మార్కాపురం, తర్లుపాడు, త్రిపురాంతకం, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాలు ఉన్నాయి. ప్రతి నెలా ఆయా మండలాల్లోని రేషన్‌షాపులతో పాటు దొనకొండలో 8 షాపులకు, కొనకనమిట్లలో 6 షాపులకుగానూ మొత్తం 150 రేషన్ దుకాణాలకు 78 టన్నుల కందిపప్పు రావాల్సి ఉంది. ఈ నెలలో దసరా నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ నబీ పండుగలున్న నేపథ్యంలో కార్డుదారులందరూ బయట మార్కెట్‌లో కిలో 120 రూపాయలు పెట్టి కందిపప్పు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతి ఒక్కరూ పప్పన్నం తినాలనే ఆశతో తమకు కందిపప్పు కావాలని డీలర్లను అడుగుతున్నారు. వారు మాత్రం ప్రభుత్వం నుంచి సరఫరా లేదంటూ సమాధానమిస్తున్నారు. పేదల పట్ల కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రజలు ఎండగడుతున్నారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

- పక్షవాతంతో మంచంపట్టిన మహిళ దీనస్థితి


పక్షవాతంతో మంచంలో ఉన్న బేగ్మున్నిషా


ఆర్థికసాయం చేసే వారి కోసం ఎదురుచూస్తూ...

గిద్దలూరు రూరల్: పక్షవాతంతో మంచంపట్టిన ఓ మహిళ ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తోంది. ఆపదలో ఉన్న తనను మనసున్న మహారాజులు ఆర్థికంగా ఆదుకోవాలని వేడుకుంటోంది. విధి వక్రీకరించి అనారోగ్య సమస్యల కారణంగా మంచానికే పరిమితమై తీవ్ర ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతోంది. గిద్దలూరు పట్టణంలోని పాములపల్లె రోడ్డులో సత్యనారాయణ థియేటర్ సమీపంలో నివాసం ఉంటున్న షేక్ బేగ్మున్నిషా గత మూడు సంవత్సరాలుగా పక్షవాతంతో కుడి చేయి, కుడి కాలు పడిపోయి అనేక ఇబ్బందులు పడుతోంది. ఒక వైపు శరీరం సహకరించక అనారోగ్యానికి గురై మంచానపడగా.. మరో వైపు ఆర్థిక స్థోమత లేకపోవడంతో కడుపు నిండా తిండి తినే పరిస్థితి కూడా లేకుండాపోయిందని వాపోతోంది. సరైన వైద్యం అందక పక్షవాతం నుంచి కోలుకోలేని పరిస్థితి ఏర్పడటంతో విలపిస్తోంది.

12 సంవత్సరాల క్రితం భర్త దూరం...

కూలి పనులు చేసుకుని జీవనం కొనసాగించే బేగ్మున్నిషాకు 12 సంవత్సరాల క్రితమే భర్త దూరమయ్యాడు. ఒక కుమార్తె ఉండగా, కూలీనాలీ చేసుకుని జీవించే వ్యక్తికిచ్చి వివాహం చేసింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్న బేగ్మున్నిషాకు పక్షవాతం వ్యాధి పెద్ద శాపంగా మారింది. దిక్కుతోచని పరిస్థితిలో ఒంటరిగా మంచానికే పరిమితమైంది. పక్షవాతంతో మంచం పట్టిన మున్నిషాను చూసి చుట్టుపక్కల వారు, సమీప బంధువులు కొందరు ఆహారం అందిస్తూ వస్తున్నారు. ఇటీవల ఆమెపై దయతలచి వైద్యుల వద్దకు తీసుకెళ్లి చూపించడంతో ఆమె హార్ట్‌బీట్ 30 శాతం మాత్రమే ఉందని చెప్పారు. ఆమె చికిత్సకు నెలకు రూ.10 వేల వరకూ ఖర్చవుతుందని తెలిపారు. అంత నగదు ఆమె వద్ద లేకపోవడంతో వైద్యం చేయించుకోలేక మంచంలోనే ఉండిపోయింది. ఆర్థికంగా, ఆరోగ్యపరంగా చితికిపోయిన తనకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందడం లేదని ఆమె వాపోతోంది. దాతలు ఎవరైనా సహృదయంతో ముందుకొచ్చి తనకు ఆర్థికసాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేస్తోంది.

ఎమ్మెల్యేగారూ.. మీకిది తగునా.?

- జెడ్పీ హైస్కూల్లో టీడీపీలోకి చేరికల కార్యక్రమం నిర్వహించిన ఉగ్రపై తీవ్ర విమర్శలు


జెడ్పీ హైస్కూల్లో టీడీపీలోకి చేరికల కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

సీఎస్ పురం (పామూరు): సీఎస్ పురం మండలంలోని సి.నాగులవరం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణం శుక్రవారం రాజకీయ వేదికగా మారింది. పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవం అనంతరం చింతపూడు, చెన్నపునాయునిపల్లెకు చెందిన పలువురికి టీడీపీ కండువాలు వేసి స్థానిక ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి పార్టీలో చేర్చుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో రాజకీయ కార్యక్రమాలు నిర్వహించకూడదని ఇటీవల ఉత్తర్వులిచ్చినప్పటికీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు ఇలా చేయడంపై పలువురు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

రూ.1.05 లక్షలు పలికిన గణేష్ లడ్డూ


లడ్డూను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

చీమకుర్తి: చీమకుర్తిలోని శ్రీకృష్ణుడి వద్ద వినాయకుడి విగ్రహం చేతిలో ఉంచిన లడ్డూకు శుక్రవారం వేలంపాట నిర్వహించగా రూ.1.05 లక్షలు పలికింది. నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన వేలంలో బత్తుల వెంకటేశ్వర్లు వినాయకుడి చేతిలో ఉంచిన లడ్డూను రూ.1.05 లక్షలకు దక్కించుకోగా, కలశం లడ్డూను మురళీధర్ రూ.20 వేలకు పాడుకున్నారు. ఆయా లడ్డూలను భక్తులతో కలిసి ఊరేగింపుగా ఇళ్లకు తీసుకెళ్లారు.


పూరీ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి పట్టివేత


పూరీ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసు బృందం

ఒంగోలు టౌన్: పోలీసుల తనిఖీల్లో పూరీ ఎక్స్‌ప్రెస్‌లో మరోసారి 11 కిలోల గంజాయి పట్టుబడింది. శుక్రవారం పూరీ నుంచి తిరుపతి వెళ్తున్న రైలులో స్పెషల్ పార్టీ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఒంగోలు నుంచి సింగరాయకొండ మధ్యలో తనిఖీ చేయగా, చెన్నైకు చెందిన ప్రేమ్ చంద్, సాకార్‌పేట్‌కు చెందిన మనీష్ వద్ద ఒక కిలో గంజాయి దొరికింది. అదే రైలులోని మరొక బోగీలో ఒక కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారణ నిమిత్తం జీఆర్‌పీ పోలీసులకు అప్పగించారు. ప్రత్యేక పోలీసుల బృందం, ఈగల్ టీం, ఆర్పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులతో పాటు మాదక ద్రవ్యాలను పసిగట్టే పోలీసు జాగిలం కూడా ఈ తనిఖీల్లో పాల్గొంది. ఒంగోలు మీదుగా ప్రయాణించే పలు రైళ్లతో పాటుగా రైల్వేస్టేషన్లలోని ప్లాట్‌ఫారాలు, పార్సిల్ కేంద్రం, ప్రయాణికుల బ్యాగులను పరిశీలించారు. అనుమానిత వ్యక్తులను విచారించారు. ఈ తనిఖీలలో మహిళా పోలీసు స్టేషన్ సీఐ సుధాకర్, ఎస్సైలు శ్రీకాంత్, ఆంజనేయులు, చెంచయ్య, జీఆర్‌పీ ఎస్సై మధుసూదన్‌రావు, ఈగల్ టీం సిబ్బంది పాల్గొన్నారు.


తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. జిల్లాకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయుడు బండి పెద్దిరాజును వైఎస్సార్ సీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి సన్మానించారు.

జిల్లా టెన్నికాయిట్ జట్ల ఎంపిక


ఎంపికైన టెన్నికాయిట్ జట్లు

సింగరాయకొండ: స్థానిక ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో శుక్రవారం జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పురుషుల, మహిళల జిల్లా జట్లను ఎంపిక చేశారు. వీరు ఈ నెల 13, 14 తేదీల్లో కోనసీమ జిల్లా మండపేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా అసోసియేషన్ సెక్రటరీ ఎన్‌టీ ప్రసాద్ తెలిపారు. ట్రెజరర్ శంకర్రావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తిపై పెట్రోలుతో దాడి, స్వల్ప గాయాలు


కందుకూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రతాప్

సింగరాయకొండ: అర్ధరాత్రి ఇంట్లో పడుకుని ఉన్న తన్నీరు ప్రతాప్ అనే వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తి కిటికీలో నుంచి పెట్రోల్ పోసి తగలబెట్టేందుకు ప్రయత్నించాడు. ఈ సంఘటన శుక్రవారం తెల్లవారుజామున సింగరాయకొండ మండలంలోని కనుమళ్ల పంచాయతీ చిన్న కనుమళ్ల గ్రామం వడ్డెపాలెంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కొంతకాలంగా ప్రతాప్, అతని భార్యకు మనస్పర్థలు ఉండటంతో ఆమె పుట్టింట్లో ఉంటోంది. ఇటీవల ప్రతాప్ తల్లి చనిపోవడంతో భార్యాభర్తలిద్దరూ కలిసి ఉంటున్నారు. రోజూలాగే ప్రతాప్ కింద పడుకోగా, ఇద్దరు పిల్లలతో భార్య మంచంపై పడుకుని ఉంది. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ప్రతాప్‌పై కిటికీలో నుంచి పెట్రోలు పోసి నిప్పుపెట్టాడు. దీంతో ప్రతాప్ కాళ్లు, చేతులు, మొహానికి స్వల్పంగా గాయాలయ్యాయి. అతను కందుకూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

కొమరోలు: మండలంలోని పలు గ్రామాల్లో ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసి 20 మందిని కరిచి గాయపరిచింది. కొమరోలు, గోపాలునిపల్లె, సూరవారిపల్లె గ్రామాల్లో గురువారం రాత్రి నుంచి పిచ్చికుక్క తిరుగుతూ కనిపించిన వారందరిపై దాడి చేసింది. దీంతో 20 మంది గాయపడి కొమరోలు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందారు. మండలంలో అధిక సంఖ్యలో కుక్కలు ఉండటం, ప్రజలను కరుస్తుండటంతో భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కుక్కలను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.